
# నెరవేరిన కల

యర్రమిల్లి ప్రభాకరరావు




ఢిల్లీ నుంచి తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ స్టేషనులో దిగాను. దాదాపు ముప్పై గంటలు జనరల్ బోగీలో ప్రయాణం. ఒళ్లు హూనం అయిపోయింది. ఇంకా దాదాపు ఐదారు గంటలు ప్రయాణం చేస్తే కానీ మా ఊరు చేరుకోను. మా ఊరు తణుకు దగ్గర చిన్న గ్రామం. తేతలి ఆ ఊరి పేరు. సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో తణుకు వెళ్లి రేపుదయం ఏడు గంటలకల్లా మా నాన్న ముందర ఉండాలని నాకెంతో తహతహగా ఉంది.

రైలు దిగి విజయవాడ ప్లాట్‌ఫారం ఒక బెంచీమీద కూర్చున్నా. నా దగ్గర చిన్న సూట్‌కేసు, చేతిలో ఒక పెద్దసైజు జిప్‌బాగ్ ఉన్నాయి. సర్కార్ ఎక్స్‌ప్రెస్ రాత్రి మూడు గంటలకు వస్తుంది. అంతవరకూ కాలక్షేపం చెయ్యాలి. నాకు పెద్దగా పుస్తకాలు చదివే అలవాటు లేదు.

సినిమాలకు వెళ్తాను గానీ, ఇప్పుడు బయటకు వెళ్లాలని లేదు. ట్రైన్ టైమ్ అయ్యేంతవరకూ ప్లాట్‌ఫారం మీదే గడిపేయాలని అనుకున్నా.

పక్కనే ఉన్న వాటర్ టాప్ దగ్గరకు వెళ్లి చల్లని నీటిలో ముఖం కడుక్కున్నా. ప్రాణం లేచివచ్చినట్లయింది. వేడి వేడిగా చాయ్ తాగాను. చాలా హాయిగా అనిపించింది. మళ్లీ నా సీటు దగ్గరకు వెళ్లి కూర్చున్నా. ఎందుకో ఈ రోజు ప్లాట్‌ఫారంమీద జనం పెద్దగా లేరు. చేతి దగ్గర సూట్‌కేసు, కాళ్లదగ్గర బాగూ పెట్టుకుని విశ్రాంతిగా కూర్చున్నా.


నాకు తెలియకుండానే ఆలోచనాప్రవాహంలో కొట్టుకుపోయా. నేనేమిటి? ఢిల్లీ వెళ్లడమేమిటి నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది.

గత సంవత్సరం నుండి జరిగిన సంఘటనలు నా మనస్సులో టీవీ సీరియల్‌లా ప్రత్యక్షమయ్యాయి.

000 000 000

దాదాపు సంవత్సరం పై మాట ఒకరోజు ఉదయం పది గంటలకు నాన్న, నేను మా ఇంటి ముందర చింతచెట్టుకింద కూర్చున్నాం. ఆ రోజు నాన్న ఏదో ఆలోచనలో ఉన్నాడు. నేను పక్కనే ఉన్న ఒక చెక్కను తీసుకుని చిత్రి పడుతున్నా. ఆ చిన్న ముక్కతో ఎన్ని కవ్వాలు అవుతాయో, ఎన్ని చపాతీపీటలవుతాయో లెక్క పెట్టుకున్నా. దాదాపు ఆరు చపాతీ పీటలు, మూడు లేక నాలుగు కవ్వాలు చెయ్యవచ్చు. నేను కొలబద్దతో కొలిచి, పెన్సిల్ ముక్కతో గీటు పెట్టుకుంటున్నా. నాన్న అంటూంటాడు "చెక్కే మన లక్ష్మి. దానిని జాగ్రత్తగా వాడుకోవాలి. వేస్ట్ చెయ్యకూడదు!" అని. నాకు ఎప్పుడూ, ఆ విషయం గుర్తుంటుంది.

నేను ఇంట్లోకి వెళ్లి చూశాను. ఏదో కొద్దిగా సామాను, ఒక మంచం ఉన్నాయి. గోడ మీద మేకుకి ఒక ఖాకీ సంచీ తగిలించి ఉంది. అది తీసి చూశాను. అందులో రంపం, ఉలి, సుత్తి, చిత్రిక, అంబుల్ మొదలైనవి ఉన్నాయి. అవి ఆయన ప్రాణం.. నాకు వారసత్వంగా ఆయన ప్రసాదించిన అమూల్యమైన సంపద. నేను అవి చూస్తూండిపోయాను కొద్దిసేపు. నాకు జ్ఞాపకం వచ్చింది. ఆయన పోయిన రోజునే నాకు బహుమతి వచ్చింది. ఒక మనిషిగా నాకు, నా కళకు, గుర్తింపు వచ్చింది.



"ఏం చేస్తున్నావురా అబ్బీ?"

"కనపడటంలేదా? ఏదో చెయ్యాలిగా ... రొట్టె పీటలు చేద్దామని..."

నా మాట పూర్తి అవలేదు. మా నాన్న "చేసి ఏం చేసుకుంటావురా? వారం రోజులనుండి చేసిన పీటలు, ముక్కాలి స్టూలు, కవ్వాలు అన్నీ అలాగే మూలపడి ఉన్నాయి. రోజూ తణుకు మార్కెట్‌కి వెళ్లి అమ్మాలని పట్టుకెళ్లి మళ్లీ సాయంకాలం తెచ్చేస్తున్నా. మన శ్రమ వేస్టు, కర్ర వేస్టు!" అన్నాడు గట్టిగా నిట్టూరుస్తూ.

నేను ఏమీ సమాధానం చెప్పలేదు. చెప్పడానికి కూడా ఏమీ లేదు. నాన్న చెప్పినదాంట్లో అసత్యం ఏమీ లేదు. ఈమధ్య స్టాకు అసలు వెళ్లడంలేదు. ఏ షావుకారుని అడిగినా అక్కర్లేదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నాడు. అదీ నిజమే! ప్లాస్టిక్ కాలం వచ్చేసింది. ప్లాస్టిక్‌తో చేసిన కవ్వాలు, చపాతీపీటలు, చిన్న చిన్న కుర్చీల దగ్గరనుంచి చివరకు కొబ్బరి కోరుకునే కోరం వరకూ అంతా ప్లాస్టిక్ ప్రపంచం అయిపోయింది. ఇంక చెక్కతో చేసిన వస్తువుల గిరాకీ బాగా తగ్గిపోయింది.

చెక్కమూతలు పోయి ప్లాస్టిక్ మూతలు వచ్చేశాయి. ఇత్తడి, స్టీలు బిందెల స్థానంలో ప్లాస్టిక్ బక్కెట్లు, బిందెలు చోటు చేసుకున్నాయి. ఆ విషయం నాకూ తెలుసు. నాజూకుగా, తీరికగా ఉండే ఆ ప్లాస్టిక్ వస్తువుల ముందర మొరటుగా, బరువుగా ఉండే ఈ చెక్కముక్కలు ఎవరికి కావాలి? ధరలో పెద్ద తేడా కూడా లేదు. నేను ఆలోచిస్తూనే నా పని చేసుకుంటూ ..

"ఎస్‌ఆర్ సొల్యూషనూ, సాండ్‌పేపర్, కొద్ది వార్నీషు తెచ్చుకోవాలి!" అన్నాను నెమ్మదిగా.

"చూద్దాంలే!" అన్నాడు నాన్న.

పని నెమ్మదిగా జరుగుతోంది. నాన్న చింతచెట్టుకు జేరగిలబడి కళ్లు మూసుకుని కూర్చున్నాడు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

సూర్యుడు నెత్తిమీదకొచ్చాడు. నాకు ఆకలి వేస్తోంది.

"అన్నం తిందామా, నాన్నా!"

"నాకు ఆకలి లేదురా, నువ్వు తిని రా! తణుకు వెళ్దాం!"

"ఇప్పుడే!" అన్నాను.


"అవును!" అన్నాడు నాన్న.

నేను గబగబా భోంచేశాను. పాంటు, షర్టు వేసుకున్నా. నాన్న పంచె, చొక్కా తొడుక్కున్నాడు. నా బట్టలు బాగానే ఉన్నాయి. నాన్నవే మాసినాయి. నాన్నవైపు చూశాను. కళ్లు ఎర్రగా ఉన్నాయి. గడ్డం కూడా మాసింది. ఇద్దరం బయలుదేరి తణుకు వచ్చాం బస్సులో.

తణుకులో బస్సు దిగిన తరువాత నాన్న చెప్పాడు

"నిన్ను పెద్ద మేస్త్రీ దగ్గర పనికి పెడతానబ్బాయ్! నువ్వు పని జాగ్రత్తగా నేర్చుకో!"

"నాకు పని వచ్చు కదా!"



"ఆ పని కాదురా! టైము టైముకి పనిలో మార్పు వస్తోంది. నీకు పనిలో కొత్త మెలకువలు తెలియాలి. లేకపోతే బతకలేవు!" అన్నాడు.

నేను నాన్నకు ఎప్పుడు ఎదురుచెప్పలేదు. నన్ను కన్న రెండు సంవత్సరాలకే మా అమ్మ పోయింది. నాన్న మళ్లీ పెళ్లి చేసుకోలేదు.

"ఆచారీ! నీకేం వయసు మించిపోయింది. రేండో పెళ్లి చేసుకోవయ్యా! పిల్లాడిని పెంచడం అంటే మాటలా! నీ కార్పెంటరీ చూసుకోవాలి, వాడ్ని పెంచాలీ అంటే కష్టం కదా!" అని ఇరుగు పొరుగు అంటే, నాన్న నవ్వి ఊరుకునేవాడు. తనకున్న ఒకే ఆస్తి చిన్న పాక. అందులో చెక్క ఉయ్యాలలో నన్ను పడుకోబెట్టి, దానికి తాడు కట్టి గుమ్మం బయట తాడును చెట్టుకు కట్టేసేవాడు. తాను చెట్టుకింద కూర్చుని పని చేసుకునేవాడట. ఎప్పుడైనా నా ఏడుపు వినిపిస్తే తాడు పట్టుకుని ఉయ్యాల ఊపేవాడట, నేను ఏడుపు ఆపేంతవరకు. నేను కొద్దిగా పెద్దయిన తరువాత తన పక్కనే కూర్చోపెట్టుకుని పనిచేసుకునేవాడు. వారానికి ఒకటి రెండు రోజులు సాయంకాలం తణుకు వెళ్లి షావుకారు కొట్లో చేసిన వస్తువులు ఇచ్చి వెంటనే తిరిగి వచ్చేసేవాడు. అంతవరకూ నేను పక్కవాళ్లింట్లో ఉండేవాడిని ఆడుకుంటూ.

వచ్చిన వెంటనే "మా రాముడు ఏడ్చాడా, అత్తా?" అని అడిగేవాడు.

"ఆఁ... నీకే ఉన్నాడయ్యా కొడుకు ... రాముడని పేరు పెట్టావు పేద్ద గొప్పగా! వాడికేం పని లేదేంటీ అస్తమానూ నాన్నా... నాన్నా... అని నిన్ను పట్టుకుని వేళ్లాడటానికి? వాడు హాయిగా ఆడుకుంటున్నాడు. నీకే ఎక్కడలేని ఆందోళన!" అంటూ అందరూ వేళాకోళం చేసేవారట.

ఆ రోజు పెద్ద మేస్త్రీ కర్రల అంగడిలో ఉన్నాడు. అక్కడే అతని వర్క్‌షాపు. చాలా పెద్దది. నలుగురు కుర్రాళ్లు అతని చేతికింద ఉన్నారు. మమ్మల్ని చూసి, "ఏం వెంకటాచారీ! ఇలా వచ్చావు?" అన్నాడు.

"ఏం లేదయ్యా! పిల్లాడిని మీకింద ఉంచుదామని. ఏదో పని నేర్చుకుంటే బతుకుతాడు, చదువు కూడా అబ్బలేదు!" అన్నాడు నాన్న.

"మరి నీకు పనిలో సాయం ఎవరు చేస్తారు?" అన్నాడు పెద్ద మేస్త్రీ.

"ఇంక నాకు పనేముందయ్యా? ఏదో పూర్వకాలం పనోడిని... ఇప్పుడు నా పనితనం ఎవరికి కావాలి? నేనేదో బతుకుతా... వీడికి దారి చూపించయ్యా! నీ ఋణం తీర్చుకోలేను!" అన్నాడు నాన్న.

పెద్ద మేస్త్రీ, "సరే, నేను ప్రస్తుతం జీతం ఏమీ ఇవ్వను. అప్రంటిస్ చెయ్యాలి. కొన్ని రోజులు తర్వాత చూద్దాం పని బాగా చేస్తే!" అన్నాడు.

"మీ ఇష్టం!" అన్నాడు నాన్న సంతోషంతో.

ఆ రకంగా నేను పనిలో చేరాను.

అంతవరకూ స్వతంత్రంగా జీవిస్తున్న నాన్న ఎవరిచేతికింద పనికి కుదురుతాడు, చిన్న వడ్రంగిగా? పోనీ, తాను కార్పెంటరీ పని చేస్తే ఆ వస్తువులకి బజారులో గిరాకీ లేదు. ఇప్పటివరకు నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండటానికి పక్క ఊరికే వెళ్లలేని నాన్న, ఈ పోటీ ప్రపంచంలో ఎలా బతుకుతాడు? అందుచేత బలవంతాన తన వృత్తి మార్చుకున్నాడు.

తణుకులో ఒక బిల్డర్ దగ్గర నెలవారీ కూలికి కుదిరిపోయాడు. తెలిసినవాళ్లు ఎవరైనా "ఆచారీ! ఏమిటిది ఇలా చేశావు?" అని అడిగితే, "ఏవుందండీ, నేను గౌరవంగా బతకాలి, మా రాముడు పైకి రావాలి!" అనేవాడు.

మేమిద్దరం ఉదయం ఆరుగంటలకే తణుకు వచ్చేసేవాళ్లం, రోజూ వంట చేసుకుని కొద్దిగా తిని, మధ్యాహ్నానికి సత్తు కారియర్లలో సర్దుకుని. మధ్యాహ్నం టీ తాగమని రోజూ నాన్న చిల్లర డబ్బులు ఇచ్చేవాడు. సాయంకాలం నాన్న ఇంటికి వెళ్లి వంట చేసేవాడు. నేను రాత్రి వెళ్లి భోజనం చేసి పడుకునేవాడిని.

నేను పనిలో రాణిస్తున్నా. ఏ కలపనైనా వెంటనే గుర్తుపట్టేస్తా. దాన్ని ముట్టుకుని అది టేకుదో, మామిడిదో, వేపదో ఏ జాతిదో చెప్పేస్తా. ఎక్కడైనా 'సుడి' ఉంటే దాని విషయం కూడా తేల్చి చెప్పేస్తా. ముక్క సైజునుబట్టి దేనికి వాడితే బావుంటుందో వెంటనే నాకు తెలిసిపోతుంది.


"గట్టిగా పదహారేళ్లు లేవు, నీకు అన్నీ తెలుసురా!" అంటాడు మేస్త్రీ.


"అవునండీ! మా నాన్న అన్నీ చెప్పాడు!" అంటాను గర్వంగా నేను.

"అవునురా, నువ్వు పుడుతూనే ఒక చేతిలో చిత్రిక, మరొక చేతిలో రంపం పుచ్చుకుని పుట్టావురా!" అంటాడు మేస్త్రీ మెచ్చుకోలుగా.

నా పనితనం కూడా అతనికి బాగా నచ్చింది. టైము వేస్ట్ చెయ్యకుండా, ముక్క వేస్ట్ చేయకుండా శ్రద్ధతో పనిచేస్తున్నా. పనిలో మెలకువలు తెలుసుకుని అందరినీ ఆకర్షించేట్లు రకరకాల వస్తువులు, ఫర్నిచర్ తయారుచేయడం నాకు వచ్చింది. నాలో ఏదో కళాకారుడున్నాడని అంటూండేవాడు మేస్త్రీ.

కానీ, నా ఖర్చు, ఇంటి ఖర్చు రెండూ నాన్నే సంపాదించవలసి వచ్చేది. అతనికి వచ్చే నెల జీతం బొటాబొటిగా సరిపోయేది. పేరుకి ఉద్యోగం కానీ, నాన్న చేసేది కూలి పనే. నాకు చాలా విచారంగా ఉండేది. నాన్నకి వృత్తిలో నైపుణ్యం ఉండి కూడా జనంలో మారుతున్న ఫాషన్లు, అభిరుచులు, అవసరాల ముందర నిస్సహాయుడై తలవంచాడు. రోజురోజుకీ మార్కెట్లో వస్తున్న అనూహ్యమైన మార్పులతో ఆయన సమానంగా పరుగెత్తలేకపోయాడు. నేను ఏదైనా చెప్పబోతే, "నేనే కాదురా, నాలాంటివాళ్లు చాలామంది ఉన్నారు. టైపు మాస్టారు చూడు, ఇప్పుడు ఎవరూ టైపు నేర్చుకోవడంలేదట ... అందరూ కంప్యూటర్ల వెనుక పరుగెడుతున్నారు. ఆయన టైపు స్కూలు మూసేశాడు. ప్రస్తుతం ఖాళీ! మన డాక్టరుగారిని చూడు, బోలెడంత ప్రాక్టీసు ఉండేది... ఇప్పుడు స్పెషలిస్టులు వచ్చేశారు. ఆయనకు చేతిలో పనిలేదు. క్లబ్బుకి వెళ్లి పేకాడుకుంటున్నాడు. అంతే! ఎవరికైనా కొంతకాలం వరకే! అసలు






ఇదంతా నీకెందుకు... నువ్వు బాగా పని నేర్చుకో!" అన్నాడు ఒకరోజు.

ఇక నేనేం మాట్లాడతాను? కానీ ఒక విషయం గమనించా. శారీరకంగా అలవాటు లేని శ్రమవలన, మానసికంగా- తన స్వంత పని మానేయడంచేత బెంగ వలన నాన్న రోజురోజుకీ చిక్కిపోతున్నాడు. కానీ నేను ఏమీ చెయ్యలేని పరిస్థితి అది; మాకు రోజులు గడవాలిగా, నాన్న కూలీ సంపాదనే ఆధారం.

ఇలా రోజులు గడుస్తున్నాయి. ఒక మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ఒక శేఠ్ గారు వచ్చాడు. ఆయన కలప వ్యాపారం, ఫర్నిచర్ వ్యాపారం చేస్తాడట. ఏదో బిజినెస్ పనిమీద తణుకు వచ్చాడు. మా షాపు దగ్గరకు వచ్చాడు. షావుకారుతో ఏదో హిందీలో, ఇంగ్లీషులో మాట్లాడుతూ, పక్కనే ఉన్న ఒక పెద్ద దుంగను చూసి, "ఏ బహుత్ అచ్ఛా మాల్ హై!" అన్నాడు.

నాకు కొద్దిగా అర్థమైంది. నేను వచ్చీ రాని హిందీలో, "నై... ఏ అచ్ఛా నహీ!" అంటూ దానిమీద చేతితో కొట్టాను. ఆ కర్ర గట్టిగా లేదు. మంచి చప్పుడు రాలేదు.

ఆ శేఠ్ మా యజమానితో "ఏ లడకా కౌన్? బినా దేఖ్‌కే సబ్ బతాతా హై!" అన్నాడు ఆశ్చర్యంగా. మా యజమాని నా గురించి చెప్పాడు. నేను చేసిన వస్తువులు కూడా చూపించాడు.

శేఠ్ నన్ను తనతో పంపమని, ఢిల్లీలో మంచి పనివాడిగా తీర్చిదిద్దుతానని చెప్పాడు. అప్పుడే మా నాన్న అక్కడకు వచ్చాడు. మా నాన్న షావుకారుతో మాట్లాడి నన్ను శేఠ్‌తో ఢిల్లీ పంపించేశాడు. ఢిల్లీలో పని నేర్చుకోమని. మా మేస్త్రీ అన్నాడు "తంతే బూరెల బుట్టలో పడ్డావురా! నీకు ఇంక ఢోకా లేదు. మీ నాన్న ముందుచూపే నీకు భవిష్యత్తు ఇస్తోంది!"

పంపించేటప్పుడు మా పెద్ద మేస్త్రీ దగ్గర ఒక రెండు వేల రూపాయలు అప్పు తీసుకుని నా చేతికి ఇచ్చాడు నాన్న. "పెద్ద సిటీ వెళ్తున్నావు. బట్టలు కుట్టించుకో. జాగ్రత్తగా పని చెయ్యి. నీతీ నిజాయతీ మరచిపోకు. మీ అమ్మకి, నాకూ మంచి పేరు తెచ్చిపెట్టు!" అన్నాడు నాన్న గద్గదస్వరంతో.

"నీ చేతిలో కర్ర ముక్క బంగారం అవుతుంది. నువ్వు మంచి పనివాడిగా తిరిగిరావాలి!" నాన్న మాటలు నా చెవిలో గింగురుమంటున్నాయి.

000

నేను గతంలోంచి బయటపడ్డా. బండి వచ్చేసింది. సాయంకాలం నుండి అక్కడే కూర్చున్నా. ఎన్ని గంటలైందో కూడా గమనించలేదు. ఢిల్లీ నుంచి తణుకు వరకు ఏక టిక్కెట్టు కొనుక్కున్నాను. మైకులో ఎనౌన్స్ చేస్తున్నారు. "మూడవ నంబరు ప్లాట్‌ఫారం మీదకు చెన్నై నుండి కాకినాడ వెళ్లు సర్కారు ఎక్స్‌ప్రెస్ వచ్చియున్నది!" అని. గబగబా పరుగెత్తి కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లాను.

కిటికీ దగ్గర సింగిల్ సీటు దొరికింది. పెట్టె, బాగ్ సీటుకింద పెట్టాను. ఉదయం మూడు గంటలవుతోంది. టీ తాగి మళ్లీ సీటులో కూర్చున్నాను. రైలు బయలుదేరింది. తెల్లవారుఝామున వచ్చే చల్లని గాలులు అలసటను దూరం చేస్తున్నాయి. మళ్లీ ఆలోచనలలో పడ్డాను.

ఢిల్లీ వెళ్లినప్పటినుండి ఈ రోజువరకూ విశ్రాంతి అనేది లేకుండా పని చేశాను. ఢిల్లీలో శేఠ్ నన్ను ఒక కార్పెంటర్ వర్క్‌షాప్ దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న మాస్టర్‌తో "మాస్టర్! ఏ లడకా హాత్ మే చెక్కా సోనా బన్‌జాయేగా! దో మహీనే మే పూరా కామ్ సిఖావో! ఖానే, పీనేకా బందోబస్త్ కరో! హమ్ పైసా దేంగే!" అన్నాడు. ఆ విధంగా మాస్టర్ దగ్గర కుదిరా. మాస్టర్ వర్క్‌లో గొప్ప ఆర్టిస్టు. చెక్కతో రకరకాల బొమ్మలు జంతువులవి, మనుషులవి చెయ్యడం, అందమైన డిజైన్లతో బొమ్మలు, ఫర్నిచర్‌మీద చెక్కడం అతనికి వెన్నెతో పెట్టిన విద్య. నలభై సంవత్సరాలుంటాయి. నన్ను "కామ్ సీఖోగే?" అని అడిగాడు. నేను తల ఊపాను.

ఆ రోజునుండి అతని దగ్గర శిష్యరికం. "గురూజీ!" అని పిలిచేవాడిని. వర్క్‌షాపే నా రూము. రెండు నెలలు నా చేతిలోంచి ఉలి, సుత్తి కిందపెట్టలేదు. వారం వారం శేఠ్ వచ్చి చేసేవాడు. "ఇస్ కా హాత్‌మే జరూర్ కొయీ జాదూ హై!" అనేవాడు.

నాకు మంచి పనివాడని పేరు వచ్చింది. నా బొమ్మలు చెక్కతో ప్రాణం పోసుకున్నట్లుగా ఉండేవి. చిన్న చిన్న బొమ్మలు రోజూ రెండు మూడు అవలీలగా చేసివడేసేవాణ్ణి. అనేక దేవతల బొమ్మలు చేశాను. నాన్నకోసం గణేష్ బొమ్మ రెండడుగుల పొడవు తుమ్మ చెక్కతో చేసింది పట్టుకెళ్తున్నా. చేరిన రెండవ నెల నుంచి శేఠ్ నాకు నెలకు రెండువేల రూపాయల చొప్పున ఇస్తున్నాడు. ఖానా, పీనా బందోబస్తు చేశాడు. ఏదో బట్టలకి, పై ఖర్చులు నేను పెట్టుకోవాలి. అంతే! కొద్దిగా ఇంగ్లీషు, బాగా హిందీ వచ్చేశాయి. ఢిల్లీ గాలి పడిందట, కొద్దిగా ఒళ్లు చేశా. రంగు కూడా మారిందట, తెల్లబడ్డానని అందరూ అంటున్నారు.

వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్లి మొహం కడుక్కుని వచ్చాను. ట్రైను గుడివాడ దాటింది.

మళ్లీ ఆలోచనలు ...

ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి నెలలు ఢిల్లీలో ఎగ్జిబిషన్ జరుగుతుంది. శేఠ్ చెప్పాడు ఎన్ని బొమ్మలైనా అమ్ముడుపోతాయి చెయ్యండి అని. వర్క్‌షాప్‌లో నా పని, మిగిలిన వాళ్లతో కలిసి బొమ్మలు చెయ్యడం, వార్నిషు, వుడ్ పెయింట్ వేయడం. రకరకాల బొమ్మలు ఎన్ని చేశానో! పనిచేసినంతకాలం మా నాన్న చెప్పిన మాటలు మరిచిపోలేదు 'నీ చేతిలో కర్రముక్క బంగారం అవుతుంది. నీతి, నిజాయతీ మరచిపోకు. పనిలో కొత్త మెలకువలు తెలుసుకోవాలి, అప్పుడే పైకి వస్తావు!" ఆయన మాటలే నాకు వేదాలు.

ఎగ్జిబిషన్‌లో మా స్టాల్ పెట్టాం. మొదటిరోజు చాలామంది జనం వచ్చారు. పెద్దపెద్ద వాళ్లతో కూడిన కమిటీ వచ్చింది. వాళ్లు మంచి బొమ్మని

సెలెక్ట్ చేసి ప్రైజు ఇస్తారట. నేను చెక్కిన 'తథాగతుడు' బొమ్మకు మొదటి బహుమతి ఐదువేల రూపాయలు ఇచ్చారు. బుద్ధుడు బోధివృక్షం క్రింద కూర్చుని తపస్సు చేసుకుంటున్నట్లు ఉన్న ఆ బొమ్మ చెక్కడానికి నాకు నాలుగు రోజులు పట్టింది. తరువాత ఆ బొమ్మను వేలం వేశాడు మా శేఠ్. ముప్పై వేల రూపాయలు పోటీపై కొనుక్కున్నారు ఎవరో ... ఫారినర్ అట... నా భుజంమీద ప్రేమతో తట్టాడు కూడా. వేలం వేయగా వచ్చిన డబ్బుని మా శేఠ్ 'కార్గిల్ ఫండ్'కి డొనేట్ చేశాడు. అందరూ నన్నూ, మా శేఠ్‌ని ఒకటే మెచ్చుకున్నారు. మా పేర్లు, ఫొటోలు హిందీ పేపర్లలో వేశారు.

మా శేఠ్ ప్రైజు డబ్బు ఐదు వేల రూపాయలూ నాకే ఇచ్చివేశాడు. ఎగ్జిబిషన్ జరిగినన్ని రోజులూ స్టాల్‌లోనే ఉన్నాను. చేతి వేళ్లు నొప్పి పుట్టినా ఉలి, సుత్తి కింద పెట్టలేదు. మా నాన్న మాటలు గుర్తుకు వచ్చేవి.. 'చేతిలో ఉలి, సుత్తి ఉన్నంత కాలం మనం ప్రపంచంలో ఎవరికీ తల వంచనక్కర్లేదు' అని. నేను బొమ్మలు చెక్కడం, మా తోటివాళ్లు వుడ్ పెయింట్ వేసి కౌంటర్‌లో పెట్టడం ... రకరకాల బొమ్మలు ... మా సేఠ్‌కు సేల్స్‌కు కొరత లేదు. డబ్బే డబ్బు! నా చేతిలో కూడా పుష్కలంగా డబ్బు ఆడుతోంది. నాన్న ఎంత సంతోషిస్తాడు!

ఎగ్జిబిషన్ అయిన వెంటనే బయలుదేరా మా ఇంటికి.

"ఫిర్ ఆవోగీ బేటా!" అని శేఠ్ అడిగాడు. "జరూర్ సాబ్!" అని మాట ఇచ్చాను. నాన్నను చూసి సంవత్సరం దాటింది. ఎలా ఉన్నాడో?

నాకు తెలియకుండానే ట్రైను గడిచిపోయింది. ట్రైన్ తణుకు వచ్చింది. నా గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. ఇంటికి వెళ్లి నాన్నను చూడాలి. తణుకు బస్టాండుకు వెళ్లి తేతరి బస్సులో కూర్చున్నా. సరిగ్గా ఏడుగంటలకి మా ఇంటి ముందర దిగాను.

గబగబా రోడ్డు దాటి ఇంటికి వెళ్లాను. చింతచెట్టు అలాగే ఉంది. మా గుడిసెకు తాళం వేసి ఉంది. ఏం చేయాలా అని ఆలోచిస్తుంటే పక్కన ఉంటున్న అవ్వ వచ్చింది.

"రాముడూ! వచ్చావా... ఇంట్లోకి రా!" అని పక్కనే ఉన్న తన ఇంటికి తీసుకెళ్లింది.

నేను గట్టుమీద కూర్చున్నా.

"నాన్న ఏడీ?" అని అడిగా అవ్వ ఇచ్చిన కాఫీ తాగి.

"ఇంకెక్కడి నాన్న... గత నెలలో పోయాడు! ఆ క్రితంరోజు పనిచేస్తూ నిచ్చెనమీద నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగిలాయి. ఆ రాత్రే చచ్చిపోయాడు. అన్నీ మేమే చేశాం. మగతలోకి వెళ్లిపోతూ, 'నా రాముడు...' అంటూనే ఉన్నాడు!" అని అవ్వ నన్ను కౌగలించుకుని బోరున ఏడ్చింది. "నీకు తెలియచేద్దామంటే ఎక్కడున్నావో ఎడ్రస్సు కూడా లేదు. రోజూ మాకు దిగులుగానే ఉంది!" అంది అవ్వ.

నేను నిశ్చేష్టుడినైపోయా. "నాన్న పోయాడా!?" నన్ను నేను నమ్మలేకపోయా. నాకు పని రావాలని, నేను పైకి రావాలని ఎప్పుడూ కలలు కనేవాడు. జీవితమంతా నా కోసం తన సుఖాన్ని త్యాగం చేశాడు. మారుతున్న కాలానికి తగినట్లుగా నేను రూపు దిద్దుకోవాలనీ, తనలా మూలపడిపోకూడదని ఆయన పడిన ఆవేదన నాకు కళ్లముందు సజీవంగా కనిపిస్తోంది. ఆయన కూలిపనికి వెళ్లిన మొదటి రోజుల్లో ఇటుకలతో ఉన్న గమ్మేళాలు మోస్తే చేతులు కాయలు కాసేవి. రక్తం వచ్చేది కూడా. ఆ కూలి డబ్బులతో నన్ను పైకి తీసుకువచ్చాడు.

"కులవృత్తికి సాటి లేదు. వృత్తిమీద గౌరవం ఉంచినంతకాలం, ప్రేమించినంతకాలం పట్టెడన్నానికి లోటు ఉండదు. ఎటొచ్చీ వృత్తిలో మెలకువలు తెలుసుకోవాలి. రోడ్డు గతుకులు పడితే ఎలా కొత్తదారి వేసుకుంటామో, అలా మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారాలి. అదే జీవితం!" అనేవాడు నాన్న.

నాన్న పెద్దగా ఏమీ చదువుకోలేదు. ఎలిమెంటరీ స్కూలుకు కూడా వెళ్లలేదు. కానీ ఆయన జీవితాన్ని చదివాడు. వృత్తిని గౌరవించాడు. తన జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ధైర్యంగా నిలబడ్డాడు. అమ్మ పోయినా మళ్లీ వివాహం చేసుకోలేదు. నన్ను స్వయంగా పెంచి పెద్ద చేశాడు. ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పటికీ నీతి నిజాయితీలను అంటిపెట్టుకునే బతికాడు. చివరివరకు, తన కష్టార్జితంతో. కొడుకు డబ్బు కూడా ఆశించకుండా పోయాడు.

నా కళ్లమ్మట కన్నీరు ధారాప్రవాహంగా వర్షించింది.

కాసేపటికి నన్ను నేను సంభాళించుకుని, లేచాను. అవ్వ మా ఇంటి తలుపులు తెరిచింది. నేను ఇంట్లోకి వెళ్లి చూశాను. ఏదో కొద్దిగా సామాను, ఒక మంచం ఉన్నాయి. గోడ మీద మేకుకి ఒక ఖాకీ సంచీ తగిలించి ఉంది. అది తీసి చూశాను. అందులో రంపం, ఉలి, సుత్తి, చిత్రిక, అంబుల్ మొదలైనవి ఉన్నాయి. అవి ఆయన ప్రాణం.. నాకు వారసత్వంగా ఆయన ప్రసాదించిన అమూల్యమైన సంపద. నేను అవి చూస్తూండిపోయాను కొద్దిసేపు. నాకు జ్ఞాపకం వచ్చింది. ఆయన పోయిన రోజునే నాకు బహుమతి వచ్చింది. ఒక మనిషిగా నాకు, నా కళకు, గుర్తింపు వచ్చింది.

జాగ్రత్తగా, అతి విలువైన వస్తువుని తీసుకున్నట్లు ఆ సంచీని చేతిలోకి తీసుకున్నా. అవ్వ చూస్తోంది.

"అవ్వా! నేను వెళ్తాను, నాన్న ఆశీర్వాదం దొరికింది!" అంటూ ఆమె కాళ్లకి నమస్కారం పెట్టి సంచీ తీసుకుని బయటకు వచ్చేశా.

నేను ఇల్లు వదలి ముందుకు నడుస్తూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను. చింతచెట్టుకింద నాన్న కూర్చుని తన చేయి ఊపుతున్నాడు నాకు వీడ్కోలు చెప్తున్నట్లు. ఆయన కన్నులలో నాకు అభిమానం, సంతోషం కన్పిస్తున్నాయి. తన కలలు నిజమైనట్లు ఆయన సంతోషిస్తున్నాడా!

నేను ముందుకు సాగిపోయాను.

■

